క్లుప్తంగా

ప్లాస్టిక్ విక్రయాలపై కొరడా



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో శానిటరీ ఇన్స్పెక్టర్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో సచివాలయం, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది శుక్రవారం పలు ప్రాంతాల్లోని వ్యాపార సముదాయాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న దుకాణం యాజమానులపై రూ. 5,200 జరిమానా విధించారు. అంతేకాకుండా 10 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు.

చీరల పంపిణీ

పామిడి: పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో శుక్రవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేపట్టారు. ఆ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముంటిమడుగు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో 30 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ బసవరాజు, కోశాధికారి జే ప్రభాకర్‌రావు. సీనియర్ సిటిజన్స్, మహిళలు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌యాదవ్‌కు డాక్టరేట్



గార్లదిన్నె: మండలంలోని కోటంక గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌యాదవ్ వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి డాక్టరేట్ (పీహెచ్‌డీ పట్టా)పొందారు. ఈయన స్టెబిలిటీ అనాలిసిస్ ఇన్ ఎ మల్టీ మెషీన్ సిస్టమ్ ఇన్‌క్లూడింగ్ రిన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్ అండర్ గ్రిడ్ కనెక్టెడ్ అండ్ ఐసోలేటెడ్ ఎన్విరాన్ మెంట్ అనే అంశంపై డా.బి సరవణన్ మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి శుక్రవారం నిర్వహించిన ఒరల్ వైవాలో అన్ని ప్రశ్నలకు సమాధానమిస్తూ ప్రదర్శనలో మెరిశారు. ఫలితంగా పీహెచ్‌డీ డిగ్రీ అందుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

జోరుగా రైల్వే ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు, కార్మికులు

గుత్తి: గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, కార్మికులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ నాయకులు రామాంజుల రెడ్డి, నారాయణ, శేఖర్ బాబు తదితరులు డీజిల్‌షెడ్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ నెల 15న గుత్తి రైల్వే ఇన్స్టిట్యూట్ ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. మజ్దూర్ యూనియన్ తరఫున తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో నిలిచారన్నారు. అందరినీ గెలిపించాలని అభ్యర్థించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుంతకల్లుటౌన్: స్థానిక మార్కెట్‌యార్డు వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రసన్నకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

సన్మానం



వెన్నపూస వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న నగరూరు గ్రామ నాయకులు

యాడికి: మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన సర్పంచు రుక్మాందర రెడ్డి తదితరులు బోగాలకట్టకు వెళ్లి ఇటీవల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎంపికైన జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు లక్ష్మీనారాయణ, నాయకులు ఆదినారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకట రాముడు, ప్రతాప్ , యోగానందరెడ్డి, రామిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వీరారెడ్డి. ఓబులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కమిటీ ఎంపిక

గుంతకల్లుటౌన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆటో కార్మికుల పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మల్లికార్జున, కార్యదర్శిగా శర్వానంద్, అధ్యక్షుడిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస యాదవ్, కోశాధికారిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ భగత్‌సింగ్ ఆటో యూనియన్‌లోకి 45 మంది గూళ్లపాళ్యం గ్రామానికి చెందిన ఆటో కార్మికులు చేరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి భవన్ నిధులు నీళ్లపాలు



పామిడిలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో మురుగు నీటి నడుమ అసంపూర్తిగా దర్శనమిస్తున్న స్త్రీ శక్తి భవన్ పిల్లర్లు

పామిడి: పామిడి అర్బన్‌కు సంబంధించి స్త్రీ శక్తి భవన్ నిర్మాణానికి నోచుకోలేదు. రూరల్‌కు సంబంధించి అనంతపురం వైపు వెళ్లే బీసీసీ రోడ్డు పక్కన మండల సమైఖ్య భవనం ఉంది. రూరల్‌కు సంబంధించి 700 దాకా సంఘాలు ఉండగా, అర్బన్ సంబంధించి 500 దాకా సంఘాలు ఉన్నాయి. అప్పటి కాంగ్రెస్ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలోని 2013 సంవత్సరంలో పట్టణ మున్సిపాలిటీకి సంబంధించి అప్పటి గుంతకల్లు ఎమ్మెల్యే కొట్రికే మధుసూధన్‌గుప్తా స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతంలో స్త్రీ నిధి కింద రూ.25 లక్షలతో స్త్రీ శక్తి భవన నిర్మాణం ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ భవనం పిల్లర్లకే పరిమితమై అసంపూర్తిగా నిలిచిపోయింది. మురుగు నీటి నడుమ పిల్లర్లు దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో స్త్రీ శక్తి భవనం నిధులు...మురుగు నీటి పాలయ్యాయి. ప్రజాధనం దుర్వినియోగమైంది. దీంతో పట్టణానికి సంబంధించి ఎస్‌హెచ్‌జీ సమావేశాలు స్థానిక గాయత్రి కాలనీలోని భవితకేంద్రంలో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో గుంతలు



గుంతకల్లులోని బీరప్పగుడి సర్కిల్‌లో జాతీయ రహదారిపై గుంతలు

గుంతకల్లు: పట్టణంలోని బీరప్ప గుడి సర్కిల్‌లోని నెల్లూరు–అంకోలా జాతీయ రహదారిలో గుంతలు ఏర్పడి వాహనాదారులు ఇబ్బందులకు గురువుతున్నారు. ఈ సర్కిల్ పట్టణంలోకి ప్రవేశం లాంటింది. బళ్లారి, ఉరవకొండ, గుత్తి, ఆలూరులకు వెళ్లాలంటే ఈ మార్గం గుండా వెళ్లాలి. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇక ద్విచక్ర వాహనాలుదారులు గుంతల మీద వెళ్లే సమయంలో స్కిడ్ అయ్యి కింద పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వేడుకుంటున్నారు.

తమలపాకు రైతులను ఆదుకోండి



క్రిష్టిపాడులో ఆకు తోటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దవడుగూరు: తమలపాకు తోటల రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ సీనియర్ నాయకుడు ఎద్దుల సూర్యనారాయణరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఆకు తోటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆకు తోట రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. క్రిష్టిపాడు, రాయలచెరువు గ్రామంలో రైతులు దాదాపు 200 ఎకరాల్లో ఆకు తోటలను సాగు చేశారన్నారు. గిట్టు బాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాలన్నారు. తమలపాకు తోటల రైతులకు సబ్సిడీలు అందించి ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నియోజక వర్గ అధ్యక్షులు ఆదినారాయణ, ఓబిరెడ్డి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, అల్లాబకాష్, బద్దెల రామాంజినేయులు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి



క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ప్రజలతో ఫిర్యాదు చేయిస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరిట పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవడంతో పాటు స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని క్యూ ఆర్ కోడ్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి ప్రజల ఇబ్బందులను తెలియజేశారు. స్మార్ట్‌మీటర్లను పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పిలుపునిచ్చిన నారా లోకేష్ ఇప్పుడు మాటతప్పి స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయించడం సిగ్గుచేటని విమర్శించారు. సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను క్లిక్ చేసి ప్రభుత్వానికి ప్రజల ఇబ్బందులను తెలియజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు జగ్గిలి రమేష్, నాగరాజు, సురేంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

ఈయూ ఆవిర్భావ దినోత్సవం

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం ఆ యూనియన్ నాయకులు, కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, జోనల్ మెంబర్ నాయక్ మాట్లాడారు. ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు, ఆందోళనలు చేసిందన్నారు. భవిష్యత్‌లో కూడా ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. డిపో సెక్రటరీ గంగేశ్వర్, నాయకులు పీకే రాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగానికి చెందిన తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు హ్యాకథాన్‌లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ శుక్రవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని గోకరాజు లైలావతి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ విభాగం వారు హ్యాక్‌గ్నోస్-2కే25 హ్యాకథాన్ నిర్వహించారన్నారు. వీటిలో ఓపెన్ ఇన్నోవేషన్ విభాగంలో మెంటల్ హెల్త్ ఎనాలసిస్ ఆఫ్ స్టూడెంట్స్ అనే వెబ్ యాప్స్‌ను అభివృద్ధి చేసి కళాశాలకు చెందిన మహహ్మద్ సబీల్, మహమ్మద్ ఇక్రామ్, మౌర్య, అయ్యప్ప, మహమ్మద్ ఫరాజ్ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ తోపాటు టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, డాక్టర్ చిత్ర లింగప్ప, ఐఐఐ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ కుమార్‌యాదవ్, అధ్యాపకులు అభినందించారు.

జనాభా నియంత్రణతోనే సంక్షేమం



యాడికిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు



బీకేఎస్ మండలం కొర్రపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: జనాభా నియంత్రణతోనే కుటుంబ సంక్షేమం సాధ్యమని యాడికి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారులు పరమేశ్వర, సుమంత్ రెడ్డి సూచించారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుని సమావేశం ఏర్పాటు చేశారు. డాక్టర్ పరమేశ్వర మాట్లాడుతూ జనాభాను నియంత్రించాలంటే ఒకరు లేదా ఇద్దరు బిడ్డలకు కుటుంబ నియంత్రణ చేసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో కలసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఏఎస్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొర్రపాడు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, బీకేఎస్ పీహెచ్‌సీ డాక్టర్ తెహరున్నీసా సూచించారు. కొర్రపాడు, బీకేఎస్ లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రపంచంలో జనాభా నియంత్రణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. చిన్న వయస్సులోనే పెళ్లి చేయడం చాలా నష్టాలు కలుగుతాయన్నారు. సీహెచ్‌ఓ మోహన్, హెల్త్ విద్యా బోధకురాలు పర్వీన్, పీహెచ్‌ఎన్ నాగలక్ష్మి, సూపర్ వైజర్‌లు శ్రీదేవి, విజయలక్ష్మి, ధనుంజయ, శివానంద, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



కల్లూరులో విద్యార్థులకు నగదు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతిలో టాప్ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు శుక్రవారం తరిమెల విజయరెడ్డి, మాజీ ఎంపీపీ తరిమెల ప్రదీప్‌రెడ్డి రూ.15వేల చొప్పున రూ.30 వేలు నగదు బహుమతి అందజేశారు. వారు మాట్లాడుతూ ఏటా తల్లి తరిమెల రాధమ్మ జ్ఞాపకార్థం కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో టాపర్‌గా నిలిచిన ఇద్దరు విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది ప్రతిభ కనబరిచిన విద్యార్థులు యమున, అమినకు నగదు బహుమతి అందజేశామన్నారు.

కుటుంబసభ్యుల చెంతకు చేరుస్తా



సంజమ్మను పరామర్శిస్తున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపప్పూరు: మీ కుటుంబ సభుల చెంతకు చేరరుస్తానని అశ్వర్థంలో 15 రోజులుగా దిక్కులేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అంధురాలికి శుక్రవారం ఎస్ఐ నాగేంద్రప్రసాద్ భరోసా ఇచ్చారు. వివరాల మేరకు సాక్షిలో శుక్రవారం పుట్లూరు మండలం కందికాపుల గ్రామానికి చెందిన సంజమ్మ అనే అంధురాలి గురించి అంధురాలిని పట్టించుకుకునేవారేరి అనే వార్త ప్రచురితమైంది. ఆ వార్తకు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ స్పందించి అశ్వత్థంలో ఉన్న ఆమెను పలకరించారు. సంజమ్మ బంధువులతో మాట్లాడానని, శనివారం వారు వచ్చి తీసుకుపోయేలా చర్యలు చేపట్టామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



డీఈఈ పద్మనాభ పిళ్లైకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుత్తి: గ్రామ, వార్డు సచివాలయాల్లో జేఎల్‌ఎం గ్రేడ్-2 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు శుక్రవారం ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ పద్మనాభ పిళ్లైకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, డివిజన్ అధ్యక్షుడు శరత్ మాట్లాడారు. నూతన సర్వీస్ రూల్స్‌ను రద్దు చేయాలన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్ -2 ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

108 వంటకాలతో అమ్మవారికి సారె



గుంతకల్లులో అమ్మవారికి సమర్పిస్తున్న 108 రకాల ఆహార పదార్థాలు

గుంతకల్లు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరిఆలయంలో శుక్రవారం 108 రకాల వంటకాలతో అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక పూజాలు చేశారు. దేవరశెట్టి నాగశ్రీ, సంతోష్ కుటుంబసభ్యులు 108 రకాల ఆహార పదార్థాలను (సారెను) తయారు చేయించారు. అనంతరం వారి ఇంటి నుంచి ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో నడువ వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపా జగదీష్, ఉపాధ్యక్షుడు జయంతి సూరి, పూజ కమిటీ సభ్యులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీ మాత

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు వాసుదేవశర్మ వాసవీ మాతను శాకంబరి అలంకారం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు.

యాడికి: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలం నుంచే కాక దూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఉత్సవాల్లో శుక్రవారం ఉదయం పెద్దమ్మ తల్లి అమ్మ వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత శాకంబరి అలంకారం, తీర్థ ప్రసాద వినియోగాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం ప్రాంగణంలో అన్నదానం చేశారు.

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆషాఢ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని వాసవీ మాతృమండలి అధ్యక్ష, కార్యదర్శులు నాగవల్లి, కీర్తి ఆధ్వర్యంలో లలిత దేవికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కన్యకా పరమేశ్వరీ మాతను పల్లకిలో కొలువుతీర్చి ప్రాకారోత్సవం గావించారు. ఊంజల్ సేవ నిర్వహించారు.



గుత్తిలో శాకంబరిగా వాసవీ మాత



యాడికిలో శాకంబరిదేవిగా పెద్దమ్మ తల్లి



పామిడిలో పూజలందుకుంటున్న వాసవీ అమ్మవారు

గుర్తు తెలియని వాహనం ఢీకొని చిత్తూరు వాసికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని మెయిన్ రోడ్డులో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొని మణికంఠ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చిత్తూరు జిల్లా పుత్తూరుకు చెందిన మణికంఠ ఐదు రోజుల క్రితం వజ్రాల అన్వేషణ కోసం జొన్నగిరి వచ్చాడు. ఈ క్రమంలో ఆర్ఎస్‌లో నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మణికంఠను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు



రమేష్‌నాయుడును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

పామిడి: స్థానిక పి.కొండాపురం క్రాస్ సమీపంలో శుక్రవారం రైలు పట్టాల వద్ద విషపూరిత ద్రావకంతో పాటు విషపు గుళికలు మింగబోతున్న బుక్కరాయసముద్రం నివాసి రమేష్‌నాయుడిని పోలీసులు సకాలంలో గుర్తించి, కాపాడారు. అనంతపురంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్‌నాయుడు కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడంటూ స్నేహితుల నుంచి సమాచారం అందుకున్న పామిడి పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ యుగంధర్ నేతృత్వంలో గాలింపు చేపట్టి విషపు గుళికలు మింగబోతుండగా అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం అప్పగించారు.

ఘనంగా రుక్మిణీ పాండురంగస్వామి వసంతోత్సవం



రుక్మిణీ పాండురంగస్వామి అశ్వ వాహన వసంత రథోత్సవ దృశ్యం

పామిడి: పట్టణంలో శుక్రవారం డబ్బీదార్ ఫిర్కా, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో వేర్వేరుగా రుక్మిణీ పాండురంగస్వామి వసంతోత్సవ కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవాలను వివిధ రకాల పూలతో శోభాయానంగా అలంకరించారు. స్వామివారి అశ్వవాహన రథోత్సవం వెంబడి భావసార క్షత్రియ భజన బృందం భక్తి సంకీర్తనలు ఆలపిస్తూ పట్టణ ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా భక్తులు రుక్మిణీ పాండురంగ స్వామి సతీ సమేత ఉత్సవ విగ్రహాలను తిలకించి తరించారు. వారు భక్తిప్రపత్తులతో పెద్ద విఠోబ, చిన్న విఠోబ ఆలయాల్లో స్వామివారిని పూజించారు. ఆనందోత్సాహాల నడుమ వసంతోత్సవం నిర్వహించుకోవడంతో వారంరోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆయా ఫిర్కాల కమిటీ సభ్యులు జవళకర్ శ్రీనివాసరావు, ఖమిత్కర్ శ్రీనివాసరావు, జవళకర్ రవీంద్రనాథ్ రావు, గోందళే రాజశేఖర్‌రావు, జోజోడే కుమార్, టీటీ నాగభూషణ్‌రావు, ఉత్తకర్ మంజునాథ్‌రావు, జే వెంకటేశ్వరరావు, ముకుందారావు, అడ్వకేట్ దత్తు, జగని రవి, నారాయణమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 15న ఆషాఢ బహుళ పంచమి పొడ్యమి మంగళవారం పామిడమ్మ హారతి నిర్వహించనున్నట్లు ఆయా ఫిర్కాల సభ్యులు తెలిపారు.

బందోబస్తు నడుమ మొహర్రం వేడుకలు



దిమ్మగుడి గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని దిమ్మగుడి గ్రామంలో భారీ బందోబస్తు నడుమ మొహర్రం వేడుకలు నిర్వహించారు. గత 30 ఏళ్లుగా నిలిచి పోయిన మొహర్రం వేడుకలు తిరిగి ప్రారంభం అవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం చిన్న సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల స్వాములను గ్రామంలో ఊరేగించడం తో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. మరి కొందరు స్వామి వారి పాదాల వద్ద నీళ్లు పోస్తూ ముందుకు సాగారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ ఆంజనేయులు, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలి

శింగనమల: క్షయ వ్యాధిగస్తులు రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్ నాయక్ సూచించారు. శుక్రవారం తరిమెల పీహెచ్‌సీలో రోగులకు మండలంలోని సప్తగిరి క్యాంపర్ వారు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో సప్తగిరి క్యాంఫర్ వైస్ ప్రెసిడెంట్ హనీఫ్, మేనేజర్ భాస్కర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లో దుక్కులతో బెట్ట నివారణ

గుత్తి రూరల్: లోతు దుక్కులు, గొడ్డు సాళ్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పంటలను బెట్ట పరిస్థితుల నుంచి కాపాడుకోవచ్చని రైతులకు హైదరాబాదుకు చెందిన నిక్రా శాస్త్రవేత్త డాక్టర్.వినోద్‌కుమార్ సింగ్ సూచించారు. మండలంలోని కరిడికొండ గ్రామంలో శుక్రవారం రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం, నిక్రా శాస్త్రవేత్తలు పర్యటించారు. గ్రామ శివారులో సాగు చేసిన కొత్త వంగడాలైన ఆముదం, కంది, సజ్జ, వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వాతావరణ అనుకూలతలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కేవీరావు, ప్రసాద్, విజయశంకర్ బాబు, నారాయణస్వామి, నటరాజ్, లక్ష్మణ్, భాస్కర్‌రావు, ఏడీఏ వెంకట్రాముడు, వీహెచ్‌ఏ అజయ్, డెటా రికార్డర్ సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.